


**యాదగిరిగుట్ట బ్రహ్మోత్సవాల్లో ప్రజా నాట్యమండలి కళాకారులకు చోటివ్వాలి**


# ప్రజాపక్షం

## జిల్లా అనుబంధం

నల్లగొండ సూర్యాపేట యాదాద్రి

సోమవారం | 20 ఏప్రిల్ , 2026 | పేజీలు : 05


# సూర్యాపేట కాంగ్రెస్‌లో 'త్రి'మూర్తులు

## నియోజకవర్గంలో ఎవరికి వారే యమునా తీరే



**ప్రజాపక్షం/సూర్యాపేట :** కలహాల కాంగ్రెస్‌గా ముద్ర ఉన్న సూర్యాపేట కాంగ్రెస్‌లో రెండుగా ఉన్న గ్రూపులు కాస్తా మూడుగా అయ్యాయి. గతంలో మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు, దివంగత నేత రాంరెడ్డి దామోదర్ రెడ్డి బ్రతికి ఉన్నంత కాలం తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి మధ్య విభేదాలు ఉండడంతో నియోజక వర్గంలో పార్టీ రెండుగా చీలింది. మున్సిపల్ ఎన్నికల ముందు పార్టీ అధిష్టానం సూచనతో దామోదర్ రెడ్డి తనయుడు ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, పటేల్ రమేష్ రెడ్డిలు ఐక్యరాగం అందుకున్నా కడుపులో కత్తులు పెట్టుకొని కౌగిలించు కుంటూ ముందుకు సాగుతున్న పరిస్థితి. ఇదిలాఉంటే తాజాగా మరో గ్రూపు పుట్టుకొచ్చింది. మొదటి నుండి ఒక్కటిగా ఉన్న సర్వోత్తమ్ రెడ్డికి, పార్టీ సీనియర్ నాయకులు, సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వేణారెడ్డి మధ్య విభేదాలు తలెత్తాయి. ఇది కాస్త రోజురోజుకు ఎక్కువై రాజకీయ ఆదిపత్యానికి దారితీసి మూడో గ్రూపు తయారైంది. సూర్యాపేట నియోజక వర్గం కాంగ్రెస్ పార్టీకి మొదటి నుంచి కంచుకోటగా ఉంది. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తరువాత కొంత మార్పు వచ్చినా నాయకుల మధ్య ఉన్న వర్గ విభేదాలతో 2014 ఎన్నికల నుండి మొదలకొని నేటి వరకు జరిగిన మూడు అసెంబ్లీ ఎన్నికల్లో ఆ పార్టీ నుంచి పోటీచేసిన దామోదర్ రెడ్డి ఓటమి చవిచూశారు. ఎన్నికలు రాగానే గెలుపు ఓటములపై విశ్లేషించే రాజకీయ విజ్ఞులు సైతం కాంగ్రెస్ పార్టీ నుండి పోటీ చేసిన వారిని ఎవరూ ఓడించాల్సిన అవసరం లేదు. వారికి వారే ఓడించుకుంటారు అని బహిరంగంగానే బల్లా గుద్ది చెబుతూ వస్తున్నారు. ఫలితాల వెల్లడి తర్వాత వీరి విశ్లేషణ 100కు వెయ్యి శాతం కరెక్టని సామాన్య ఓటర్ కూడా చెబుతున్న పరిస్థితి. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత సూర్యాపేట నియోజక వర్గ పార్టీ ఇంచార్జిగా మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డి వ్యవహరించారు. ఆయన మరణానంతరం పార్టీ ఇంచార్జి ఎవరన్నది అధిష్టానం ప్రకటించకుండా తాత్సారం చేయడంతో పార్టీకి పెద్దదిక్కు లేకుండా అయ్యింది. దీనితో తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి ఇన్‌చార్జి పదవి కోసం పోటీపడుతున్నారు. ఖాళీగా ఉన్న ఈ పదవిని ఆరు నెలలు అవుతున్నా నేటికి భర్తీ చేయకపోవడంతో ఎవరికి వారు అధిష్టానం దృష్టిని ఆకర్షించేలా పార్టీ కార్యక్రమాలు చేస్తూ ముందుకు సాగుతున్నారు. అలాగే ఇటీవల కాలంలో వరుసగా వచ్చిన గ్రామ పంచాయితీ, మున్సిపల్ ఎన్నికల్లో ఎవరికి వారు పార్టీ నుండి పోటీ చేసిన అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేసి తమ ప్రతిభను చాటుకున్నారు.

**మున్సిపల్ ఎన్నికల ముందు నుండే మూడో గ్రూపు...**

సూర్యాపేట నియోజక వర్గంలో రెండు గ్రూపులుగా ఉన్న కాంగ్రెస్‌లో మున్సిపల్ ఎన్నికల ముందు నుండే మూడో గ్రూపు ఏర్పడింది. సూర్యాపేట మున్సిపల్ ఎన్నికల్లో టిక్కెట్ల కేటాయింపు కూడా అలాగే జరిగిందన్నది అక్షర సత్యం. దామోదర్ రెడ్డికి కుడిభుజంగా 40 సంవత్సరాలుగా కొనసాగిన కొప్పుల వేణారెడ్డికి తనకు అనుచరగనం ఎక్కువగానే ఉంది. ఎన్నికల్లో గెలుపు గుర్రాల కే టిక్కెట్లు ఇవ్వాలని సర్వేలు నిర్వహించినా అవి పక్కకు పెట్టి తమ అనుచరులకు టిక్కెట్లు వచ్చేలా పంపకాలు చేసుకున్న పరిస్థితి. ఈ మూడు గ్రూపులు ఒక్కటై మున్సిపాలిటీపై కాంగ్రెస్ జెండా ఎగురవేసినా...వీరి మధ్య ఉన్న విభేదాల వాసన పోకపోవడం గమనార్హం. పటేల్ రమేష్‌రెడ్డితో ఉన్న విభేదాలు కాస్త సర్దుమనిగినా సర్వోత్తమ్ రెడ్డి, వేణారెడ్డిల మధ్య మాత్రం రోజు రోజుకు ఎ క్కువై వీరి మధ్య దూరం పెరుగుతుంది. నియోజకవర్గం లో ఎవరి కార్యక్రమాలు వారు చేసుకుంటూ పోతున్నారు.

**వేణారెడ్డి పుట్టిన రోజు వేడుకలకు ఆయన అభిమానులు సన్నద్ధం**

సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి జన్మదినం ఈనెల 22న ఉండడంతో ఆయన అభిమానాలు పుట్టిన రోజు వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు సన్నద్ధమవుతున్నారు. ఈనెల 5వ తేదీన రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి పుట్టిన రోజు వేడుకలు సూర్యాపేట, తుంగుతుర్తి నియోజక వర్గాల వ్యాప్తంగా కాంగ్రెస్ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. దీనికి ధీటుగా వేణారెడ్డి అభిమానాలు పుట్టిన రోజు వేడుకలు జరుపుకోవాలని పట్టుదలతో ఉన్నట్లు సమాచారం.

**తలలు పట్టుకుంటున్న కాంగ్రెస్ కార్యకర్తలు!**

మాజీ మంత్రి దామోదర్ రెడ్డి మరణానంతరం జరిగిన గ్రామ పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ తన సత్తా చాటడంతో ఉత్సాహంగా ఉన్న పార్టీ శ్రేణులు గ్రూపు రాజకీయాలతో నిరుత్సాహానికి లోనయ్యారు. తమ అభిమాన నాయకుల కోసం ఫ్లెక్సీల ఏర్పాటు, కా ర్యక్రమాలలో పాల్గొనడం లాంటివి చేయడం రాజకీయా ల్లో ఆనవాయితి. కాగా నేతలు విడిపోయి ఎవరికి వారు కార్యక్రమాలు చేసుకుంటూ పోవడంతో ఎవరి వద్దకు వెళ్లాలో తెలియక తలలు పట్టుకుంటున్నారు. కరవమం టే కప్పకు కోపం... విడవమంటే పాముకు కోపంలా పార్టీశ్రేణుల పరిస్థితి ఉంది. ఆయా పనుల కోసం వెళ్లేవా రు కూడా ఎటు పోవాలో తెలియక సతమతమవుతున్నా రు. ప్రభుత్వ అధికారులు సైతం పనుల కోసం నేతలు ఫోన్ చేస్తే ఎవరిది చేయాలో ఎవరిది చేయవద్దో అంతుచిక్కక అడకత్తెరలో పోక పెట్టి ఒత్తినప్పుడు అది ఎలా నలిగిపోతుందో వీరి పరిస్థితి అలానే ఉంది. ఇప్పటికైన పార్టీ అధిష్టానం సూర్యాపేట నియోజక వర్గానికి ఇంచార్జి ఎవరన్నది ప్రకటిస్తే ఈ గ్రూపు రాజకీయాలకు పులిస్టాప్ పడుతుందని రాజకీయ విజ్ఞులు వ్యాఖ్యానిస్తున్నారు.

## మహిళా బిల్లు ముసుగులో బిజెపి కుట్ర

### ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య

**ప్రజాపక్షం/యాదగిరిగుట్ట** : మహిళా రిజర్వేషన్ బిల్లు పేరిట దేశ సమాఖ్య స్వరూపాన్ని ఛిన్నాభిన్నం చేయాలని చూస్తున్న కేంద్రంలోని మోదీ, అమిత్ షా ద్వయం కుట్రలను కాంగ్రెస్ పార్టీ సమర్థవంతంగా తిప్పికొట్టిందని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య ధ్వజమెత్తారు. యాదగిరిగుట్టలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, బీజేపీ ద్వంద్వ నీతిని ఎండగట్టారు. పార్లమెంట్లో బిల్లు నెగ్గితే తమ గొప్పగా చాటుకోవాలని, విఫలమైతే ప్రతిపక్షాలపై బురద చల్లాలని చూసిన బీజేపీ ఎత్తుగడలను రాహుల్ గాంధీ, ఖర్గేల నాయకత్వంలో కాంగ్రెస్ పటాపంచలు చేసిందని ఆరోపించారు. గతంలో నల్ల చట్టాలతో రైతులపై కక్షగట్టిన బీజేపీకి పట్టిన గతే ఈ బిల్లు విషయంలోనూ పునరావృతమైందని, దక్షిణాది రాష్ట్రాల హక్కుల కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సాగిస్తున్న పోరాటం అభినందనీయమని కొనియాడారు. రాజ్యాంగాన్ని మార్చి, రిజర్వేషన్లు రద్దు చేసి బలహీన వర్గాల నడ్డి విరవాలన్నది బీజేపీ అసలు ఉద్దేశమని, కానీ రాహుల్ గాంధీ అండగా ఉన్నంత వరకు ఆ ఆటలు సాగవని హెచ్చరించారు. నిజంగా మహిళలపై ప్రేమ ఉంటే ప్రస్తుతం ఉన్న 543 సీట్లతోనే రిజర్వేషన్లు అమలు చేయాలని, డీలిమిటేషన్ పేరుతో కాలయాపన చేస్తూ రాజకీయ లబ్ధి పొందాలని చూడటం మహిళా లోకాన్ని వంచించడమేనని అయిలయ్య విమర్శించారు. రాజకీయ ఎత్తుగడల కోసం మహిళలను పావులుగా వాడుకుంటున్నందుకు బీజేపీ బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పీసీసీ ప్రధాన కార్యదర్శి జనగాం ఉపేందర్ రెడ్డి, మాజీ డిసిసి అధ్యక్షులు అండెం సంజీవరెడ్డి, మున్సిపల్ చైర్మన్ వాణి, మదర్ డైరీ చైర్మన్ మధుసూదన్ రెడ్డి పాల్గొన్నారు.

## పురుగుల మందు తాగి యువకుడు ఆత్మహత్యాయత్నం



**ప్రజాపక్షం/నకిరేకల్** : కేతేపల్లి మండలం గుడివాడ గ్రామంలో ఓ యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. స్థానికులు, కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం గ్రామానికి చెందిన కదిరే సతీష్ కు భార్య ఉప్పలమ్మతో కొంతకాలంగా కుటుంబ కలహాలు కొనసాగుతున్నాయి.ఈ నేపథ్యంలో ఈ నెల 15న ఉప్పలమ్మ నకిరేకల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.ఫిర్యాదు స్వీకరించిన పోలీసులు గత నాలుగు రోజులుగా సతీష్‌ను స్టేషన్‌కు హాజరుకావాలని పిలుస్తున్నప్పటికీ ఆయన వెళ్లలేదు.దీంతో ఆదివారం పోలీస్ సిబ్బంది ఇంటికి వెళ్లగా అతను అక్కడ లేడని తెలిసింది.అనంతరం ఫోన్‌లో సంప్రదించగా వస్తున్నానని చెప్పిన సతీష్, పురుగుల మందు తీసుకొచ్చుకొని పోలీసుల సమక్షంలోనే సేవించాడు. దీనిని గమనించిన పోలీసులు వెంటనే స్పందించి అతన్ని నకిరేకల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.ఇదిలా ఉండగా పోలీసుల ఒత్తిడి వల్లనే సతీష్ ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు.అయితే ఈ ఆరోపణలను పోలీసులు ఖండించారు.ఈ విషయమై పట్టణ సీఐ హరిబాబు వివరణ ఇస్తూ, భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ కొనసాగిస్తున్నాం. సతీష్‌ను పలుమార్లు స్టేషన్‌కు రమ్మని పిలిచినా హాజరుకాలేదు. ఆదివారం సిబ్బందిని పంపగా భయంతో పురుగుల మందు సేవించాడు. ఈ ఘటనతో పోలీసులకు ఎలాంటి సంబంధం లేదు అని తెలిపారు.



## పూర్వ విద్యార్థుల సమ్మేళనం

**ప్రజాపక్షం/అర్వపల్లి :** 30 వసంతాలు పూర్తి అయిన సందర్భంగా విజ్ఞాన్ ఉన్నత పాఠశాలలో 199596 పదో తరగతి పూర్తి చేసుకున్న పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. విద్యార్థులంతా కలిసి విద్యను బోధించిన గురువులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారి స్కూల్‌లోని తమ చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఉపాధ్యాయులు రత్నం లక్ష్మాజి, కుంభం రామ్మూర్తి, దబ్బేటి యాదగిరి, కరుణాకర్, సత్యనారాయణ, నాగరాజు, భద్రయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

## అగ్ని ప్రమాదాలపై అవగాహన



**ప్రజాపక్షం/కోదాడ రూరల్ :** అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా గుడిబండ రోడ్డులో గల డిమార్ట్ నందు ఆదివారం అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవల్సిన జాగ్రత్తలు, అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు ఎలా ఆర్పాలో తగు జాగ్రత్తలు గురించి అగ్నిమాపక అధికారి డాక్టర్ కె. బాబు డిమార్ట్ సిబ్బందితో మాక్ డ్రిల్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అగ్నిప్రమాదాలు మీరు ఉద్యోగం చేస్తున్న ప్రాంతాల్లోనే జరిగినప్పుడు కాకుండా మీరు నివాసం ఉంటున్న గ్రామాలలో జరిగినప్పుడు మీరు ఆ ప్రమాదాన్ని నివారించడానికి కూడా సహకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిమార్ట్ మేనేజ్‌మెంట్, ఫైర్ సిబ్బంది ఎం. శ్రీనివాస్, లీడింగ్ ఫైర్ ఫైటర్ డి. ప్రకాష్, జి. శ్రీనివాసరావు, ప్రవీణ్‌కుమార్, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## ఆర్థిక సహాయం




**ప్రజాపక్షం/అర్వపల్లి :** తమ చిన్ననాటి మిత్రుడు నవీన్ తల్లి నోముల పుష్పలత అనారోగ్యంతో మృతి చెందారు. ఆదివారం నవీన్ చిన్ననాటి మిత్రులు పదవ తరగతి 2011/12 బ్యాచ్‌కి చెందిన విద్యార్థులంతా కలిసి రూ.18వేలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. వారి కుటుంబీకులను పరామర్శించి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పరామర్శించిన వారిలో కె. శ్రీకాంత్, వై. శ్రీకాంత్, ఆర్. నవీన్, డి. నవీన్, కె. కార్తీక్, బి. నాగరాజు, ఈ. కోటి, డి. దినేష్‌లు ఉన్నారు.

## సమావేశాన్ని జయప్రదం చేయాలి

**ప్రజాపక్షం/పెన్‌పహాడ్ :** ఈనెల 22న సూర్యాపేట సిఐటియు కార్యాలయంలో జరిగే సిఐటియు జిల్లా విస్తృతస్థాయి సమావేశానికి మండలంలోని వివిధ రంగాల కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా కమిటి సభ్యుడు రణపంగ కృష్ణ కోరారు. ఆదివారం మండలంలోని పొట్లపాడు గ్రామంలో జరిగిన సమన్వయ కమిటి సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాలలో కార్మికులపై ఉన్నటువంటి రాజకీయ వేధింపులు తగ్గించాలని, కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించనున్నట్లు వివరించారు. గంగారపు వెంకన్న, నారాయణ ప్రమీల, గొబ్బి శ్రీకాంత్, రాములమ్మ పాల్గొన్నారు.

# నృత్య కళాకారులకు సన్మానం

**ప్రజాపక్షం/చిట్యాల:** నల్లగొండ జిల్లా చిట్యాల పట్టణంలో శ్రీరాధిక డాన్స్ అండ్ మ్యూజిక్ అకాడమీకి చెందిన కూచిపూడి నృత్య కళాకారులను తెలంగాణ భాష సాంస్కృతిక శాఖ సంచాలకులు, కవి డాక్టర్ ఏనుగు నర్సింహ్మారెడ్డి, విశ్రాంత న్యాయమూర్తి కుకుడాల లక్ష్మ ణ్‌లు సంయుక్తంగా సన్మానించారు. ఆదివారం చిట్యాలలో ఏర్పాటు చేసిన ఏనుగు నర్సింహ్మారెడ్డి పౌర సన్మాన కార్యక్రమంలో అకాడమీ నాట్య గురు మాడభూషిని రమణిసిద్ధి శిష్యబృందం కుమారి పెద్ది సరయు, పాపిశెట్టి వైష్ణవి, ఓరుగంటి వైష్ణవి, పుట్టపాక శ్రీవేద, కోడూరి శాన్వి, ఎన్ గాయత్రిలు కూచిపూడి నృత్య ప్రదర్శనలు చేశారు. చక్కని అభినయాన్ని ప్రదర్శించిన చిన్నారులను వారు అభినందించి శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రమోద సాహితీ సంస్థ ప్రతినిధులు కుకుడాల గోవర్ధన్, సాగర్ల సత్తయ్య, తాడూరి చంద్రం తదితరులు పాల్గొన్నారు.



# ఆత్మరక్షణతోపాటు మెదడుకు ఉత్తేజం కరాటే




**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** కరాటే శిక్షణ ద్వారా ఆత్మరక్షణతోపాటు మెదడును ఉత్తేజ పరచడంలో సహాయపడుతుందని ప్రముఖ వైద్యులు, 18వ వార్డు కౌన్సిలర్ డాక్టర్ ఊర రామ్మూర్తి యాదవ్ అన్నారు. ఆదివారం పట్టణంలోని బేబీ మూన్ పాఠశాలలో సుమన్ షోటోఖాన్ కరాటే స్పోర్ట్స్ డు అకాడమీ ఆధ్వర్యంలో కరాటే మాస్టర్ జె.వి. రమణ ఆధ్వర్యంలో కరాటే శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థిని విద్యార్థులకు బెల్టులు, సర్టిఫికెట్లు ప్రదానం చేసి మాట్లాడారు. ప్రస్తుత సమాజంలోని విద్యార్థిని విద్యార్థులకు కరాటే అవసరం ఎంతైనా ఉందన్నారు. ముఖ్యంగా విద్యార్థినీలు కరాటే శిక్షణ నేర్చుకోవాలన్నారు. మాస్టర్స్ జె.వి. రమణ, ఆర్. సంతోష్, రిషికేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

# దరువు జాతరను విజయవంతం చేయాలి

**ప్రజాపక్షం/గరిడేపల్లి:** హైద్రాబాద్‌లోని రవీంద్రభారతిలో జరిగే దరువు జాతరను విజయవంతం చేయాలని డప్పు కళాకారుడు అమరారపు సతీష్ పిలుపునిచ్చారు. ఆదివారం మండల కేంద్రంలోని ఆయన విలేకరులతో మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమం నుండి మొదలు కొని నాటి నుండి ఎన్నో ప్రజా ఉద్యమాలు చేసిన ఘనత డాక్టర్ దరువు ఎల్లన్న, దరువు అంజన్నలకే దక్కుతుందని అన్నారు. దరువు వేదికను స్థాపించి 25 సంవత్సరాల సందర్భంగా వీరులారా వందనం విద్యార్థి అమరులా వందనం వీడియో పాటను విడుదల చేయడం జరుగుతుందని కావున ఉద్యమ కళాకారులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వీరబాబు, శోభన్, సాయి, నాగమణి, కల్పనా, రాణి, స్వరూప, అనురాధ, సుజాత పాల్గొన్నారు.



# నర్సింహ్మారెడ్డి రచనల్లో గ్రామీణ జీవన వాస్తవాలు

**ప్రజాపక్షం/చిట్యాల:** డాక్టర్ ఏనుగు నర్సింహ్మారెడ్డి రచనలు గ్రామీణ జీవన వాస్తవాలను తెలియజేే స్తాయని విశ్రాంత న్యాయమూర్తి కుకుడాల లక్ష్మ ణ్ అన్నారు. నల్లగొండ జిల్లా చిట్యాల పట్టణానికి చెందిన ప్రముఖ సాహితీ వేత్త, తెలంగాణ భాష సాంస్కృతిక శాఖ సంచాలకులు కవి ఏనుగు నర్సింహ్మారెడ్డి ఐఏఎస్ అధికార హోదా లభించిన సందర్భంగా ఆదివారం పట్టణంలో ప్రమోద సాహితీ సంస్థ ఆధ్వర్యంలో పౌర సన్మానాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ నర్సిహ్మారెడ్డి సాహిత్యం సమాజాన్ని ఆలోచింపజేసే శక్తి కలిగి ఉంటుందని, సామాజిక సమస్యలు, తాత్విక భావాజాలాన్ని ప్రతిబింబిస్తా యని కొనియాడారు. తెలుగు సాహిత్యానికి విశిష్ట సేవలు అందిస్తున్న ఆయన ప్రముఖ సాహితీవేత్తగా ప్రసిద్ధి చెందారని, కవిత్వం, వ్యాసరచన, అనువాదం వంటి రంగాలలో ఆయన చేస్తున్న కృషి విశేషమైనదని అన్నారు. మానవ విలువలు, జీవన సత్యాలను సున్నితంగా తన రచనలలో పొందుపరు స్తారని, సాధారణ ప్రజల భావోద్వేగాలను సరళమైన భాషలో వ్యక్తీకరించడం ఆయన ప్రత్యేకతని కొనియడారు. భవిష్యత్తులో జ్ఞానపీఠ్ లాంటి జాతీయ స్థాయి అవార్డులు ఆయన అందుకోవాలని ఆయన ఆకాంక్షించారు. పౌర సన్మాన గ్రహీత ఏనుగు నర్సింహ్మారెడ్డి మాట్లాడుతూ చిట్యాలలోని ప్రభుత్వ పాఠశాలలో నేర్చుకున్న చదువే నన్ను కవిగా మార్చిందన్నారు. తనకు పౌర సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేసి సన్మానించిన ఆత్మీయలందరికి నర్సింహ్మారెడ్డి కృతజతలు తెలిపారు. ఈ కార్యక్ర మానికి ప్రమోద సాహితీ సంస్థ గౌరవ సలహాదారులు కుకుడాల గోవర్ధన్ అధ్యక్షత వహించగా, మున్సిపల్ చైర్ పర్సన్ పందిరి గీతారమేష్, వైస్ చైర్మన్ గుండెబోయిన శ్రీలక్ష్మి సైదులు, ప్రముఖ సాహితీ వేత్తలు నాళేశ్వరం శంకరం, డాక్టర్ తండు కృష్ణ కౌండిన్య, పెరుమాళ్ళ ఆనంద్, ఏభూషి నరసింహ్మా, పాటి మోహన్‌రెడ్డి, తాడూరి చంద్రం, మున్సిపల్ కౌన్సిలర్లు పాల్గొన్నారు. సభ ప్రారంభం ముందు హైదరాబాద్‌కు చెందిన శ్రీ రాధిక నృత్య కళాశాలకు చెందిన చిన్నారులు ప్రదర్శించిన కూచిపూడి నృత్యాలు సభికులను ఆకట్టుకున్నాయి.





## మహిళా రిజర్వేషన్‌లలో బిసిల వాటా తేల్చాలి

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** మహిళా రిజర్వేషన్లకు కాంగ్రెస్ గాని ఇండియా కూటమి గాని వ్యతిరేకం కాదని సీనియర్ కాంగ్రెస్ నాయకులు, 18వ వార్డు కౌన్సిలర్ డాక్టర్ ఊర రామ్మూర్తి యాదవ్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2023లోనే ఈ బిల్లు పాస్ అయిందన్నారు. అయినప్పటికి 2024లో జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో బిజెపి మహిళా రిజర్వేషన్లు అమలు చేయలేదన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎప్పుడు కూడా మహిళా రిజర్వేషన్లకు వ్యతిరేకం కాదని, కానీ బిసి మహిళలకు కూడా రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారని అందుకు బిజెపి ఒప్పుకోలేదని వివరించారు. ఈ సమావేశంలో బిసి సంఘం నాయకులు బయ్య మల్లికార్జున్, హమీద్‌ఖాన్ పాల్గొన్నారు.

## ఘనంగా హిందూ సమ్మేళన కార్యక్రమం




**ప్రజాపక్షం/నేరేడుచర్ల:** నేరేడుచర్ల పట్టణంలోని ఆదివారం హిందు ధర్మ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో హిందు సమ్మేళన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని పాత నేరేడుచర్ల ఆంజనేయ స్వామి గుడి వద్ద జై శ్రీరామ్ నినాదాలతో శ్రీరామ్ హనుమాన్ విగ్రహాలతో కోలాటాలతో పురవీధులలో వైభవంగా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జగిత్యాల ధర్మరక్షణ పీఠాధిపతి లక్ష్మీనారాయణ స్వామిజీ మాట్లాడుతూ హిందు సమాజాన్ని చైతన్యవంతం చేసి, సమైక్య ప రిచి మన దేశాన్ని విశ్వ గురువుగా నిలపాలనే లక్ష్యంతో నేటి కాలమాన పరిస్థితుల్లో ఎదురవుతున్న అనేక సవాళ్లను ఎదుర్కొనేందుకు హిందువుల ఐక్యత అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో హిందు ధర్మ పరీరక్షణ సమితి సభ్యులు, పుర ప్రముఖులు, మహిళలు పాల్గొన్నారు.

## దళిత రత్న అవార్డు గ్రహీత వెంకటేశ్వర్లు




**ప్రజాపక్షం/గరిడేపల్లి హుజూర్‌నగర్:** హైద్రాబాద్‌లోని రవీంద్రభారతిలో డాక్టర్ జగ్జీవన్‌రామ్, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా ఎమ్మార్పీఎస్ ఉద్యమంలో మాదిగలకు చేసిన సేవను గుర్తించి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం దళిత నాయకులను దళితుల కోసం విశిష్ట సేవలందించిన వారికి దళిత రత్న అవార్డు ప్రధానం చేశారు. మండల పరిధిలోని కాచవారిగూడెం రాష్ట్ర ఎమ్మార్పీఎస్ కార్యదర్శి మిద్దె వెంకటేశ్వర్లు, మేడి పాపయ్య నాయకత్వ ఉద్యమంలో పాల్గొన్నారని అన్నారు. తాను చేసిన సేవలను గుర్తించి దళితరత్న అవార్డు ప్రధానం చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గంటా సుదర్శన్, పల్లేటి లక్ష్మ ణ్, చింతబాబు మాదిగ, రాపోలు నర్సయ్య, రావూరి విజయ భాస్కర్, పిడమర్తి నారాయణ, కాస్తాల సైదులు పాల్గొన్నారు.

## చలివేంద్రం ప్రారంభం



**ప్రజాపక్షం/అనంతగిరి:** వేసవి కాలాన్నిదృష్టిలో పెట్టుకుని గ్రామ ప్రజల సౌకర్యార్థం తాగు నీరు ప్రజల దాహార్తిని తీరుస్తుందని దాత చుండూరు అచ్చ య్య కుమారులు మురళి, సుధీర్‌ల సహకారంతో చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు గ్రామ సర్పంచ్ నందిగామ శ్రీనివాస్‌లు అన్నా రు. వాయిలసింగారం గ్రామంలో ఏర్పాటు చేసిన నూతన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. గద్దె రఘు, కొల్లు సుబ్బారావు, మురళి, గద్దె రామారావు, సైదులు, సతీష్, జక్రయ్య, కోటయ్య పాల్గొన్నారు.



## శివాలయ నిర్మాణ కమిటీ ఏర్పాటు

**ప్రజాపక్షం/మోటకొండూర్** : మోటకొండూర్ మండలంలోని తేర్యాలలో ఎంతో కాలంగా శిథిలావస్థలో ఉన్న శివాలయం నిర్మాణం కోసం నూతన కమిటీ ఏర్పాటు చేశారు. ఈ కమిటీ గౌరవ అధ్యక్షులు సర్పంచ్ మంత్రి లత, అధ్యక్షుడు మంత్రి స్వామిఉపాధ్యక్షులు ఎం.సిద్దిరాములు, డి.మల్లారెడ్డి, ప్రధాన కార్యదర్శి సామ భూపాల్ రెడ్డి, సంయుక్త కార్యదర్శి బి.ముత్యాలు, కోశాధికారి బాజ బాలకృష్ణ, గౌరవ సలహాదా రులుగా మంత్రి శ్రీశైలం, దొంతిరి నర్సింహారెడ్డి, భూరెడ్డి రవీందర్ రెడ్డి, సామ తిర్మల్ రెడ్డి, గంట రాఘవరెడ్డి, గంగుల వెంకట్‌రెడ్డి, పంజాల బాలరాజు, కంచర్ల శ్రీకాంత్, బొంగు సురేష్, ఇంద్రాల శ్రీను, గంగుల రవీందర్ రెడ్డి మరియు 15 మంది కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు.

## కొనుగోలు కేంద్రం ప్రారంభం



**ప్రజాపక్షం/ఆత్మకూర్(యం)** : ఐకెపి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ నాగుల సత్యనారాయణ కోరారు.ఆదివారం మండలంలోని పోతిరెడ్డిపల్లి గ్రామములో ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు దళారులకు ధాన్యం విక్రయించి మోసపోవద్దని ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంలోనే ధాన్యం విక్రయించి ప్రభుత్వం అందిస్తున్న మద్దతు ధరను పొందాలని కోరారు. ధాన్యం కొనుగోలు కమిటీ సభ్యులు సీరియల్ ప్రకారం రైతుల పంట కొనుగోలు చేయాలని, దాన్ని కొనుగోలు కేంద్రంలో నీడ మంచినీరు ఉండేలా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్, వార్డ్ మెంబెర్స్, గ్రామ పెద్దలు వివో అధ్యక్షురాలు, కమిటీ సభ్యులు మెంబెర్స్ ఏపీఎం పాల్గొన్నారు.

## గుర్రపు డెక్క ఆకును తొలగించి రైతుల సమస్యను పరిష్కరించాలి

**ప్రజాపక్షం/రామన్నపేట** : మునిపంపుల గ్రామపరిధి అసిఫ్ నహర్ కాలువలో పేరుకుపోయిన గుర్రపుడెక్క ఆకును తొలగించి శిథిలావస్థకు చేరిన కాల్వకట్టను మరమ్మత్తులు చేయాలని సిపిఎం మండల కార్యదర్శి, గ్రామ సర్పంచ్ బొడ్డుపల్లి వెంకటేశం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిపిఎం పోరుయాత్రలో భాగంగా గ్రామ నాయకత్వంతో కలిసి అసిఫ్ నగర్ (రాచకాల్వను) పరిశీలన చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు తలుపునూరి శ్రీనివాస్, శాఖ కార్యదర్శి తాళ్లపల్లి జితేందర్, వార్డు సభ్యులు గంటెపాక శ్రీను, బూడిద నర్మదనర్సింహా, నాయకులు తొలుపునూరి చంద్రశేఖర్, గంటపాక శివకుమార్, మేడి ముకుంద, ఎండి మైనొద్దీన్ పాల్గొన్నారు.



## నేటి విద్యార్థులే రేపటి భావి భారత పౌరులు



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్** : నేటి విద్యార్థులే రేపటి భావి భారత పౌరులని వారిని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడమే తమ ముందున్న లక్ష్యమని సిటి టాలెంట్ స్కూల్ చైర్మన్ ప్రకాష్ రెడ్డి అన్నారు. ఆదివారం సిటి టాలెంట్ పాఠశాలలో జరిగిన ఫేర్వెల్ వేడుకలలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గత 20 సంవత్సరాల నుండి విలువలతో కూడిన విద్యను అందిస్తున్నామన్నారు. ప్రతి విద్యార్థికి క్రమశిక్షణ చాలా అవసరమని తెలిపారు. గురువులు చెప్పిన విధంగా నడుచుకున్న వారే జీవితంలో విజయం సాధిస్తారన్నారు. తమ పిల్లల ప్రోగ్రెస్ గురించి తల్లిదండ్రులు నిత్యం వారి క్లాస్ టీచర్‌ను సంప్రదించవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో టాలెంట్ స్కూల్ ప్రిన్సిపాల్ మురళీధర్, ఎలైట్ స్కూల్ ప్రిన్సిపాల్ సుకృతా రెడ్డి, న్యూవిజన్ స్కూల్ ప్రిన్సిపాల్ కిరణ్ పాల్గొన్నారు.

## ఘనంగా వార్షికోత్సవం ఆరోహణ




**ప్రజాపక్షం/రామన్నపేట** : రామన్న పేట మండల కేంద్రంలోని నాగార్జున పాఠశాలలో శనివారం రోజున వార్షికోత్సవం ఘనంగా నిర్వహించబడింది. ఈ సంవత్సరానికి ఆరోహణ అనే థీమ్ను ఎంపిక చేశారు. ఆరోహణ అంటే విజయపథంలో ముందుకు సాగడం అనే అర్థాన్ని సూచిస్తుంది. ఈ థీమ్ ద్వారా విద్యార్థులు తమ జీవితంలో ఉన్నత లక్ష్యాలను సాధించాలని ప్రేరణ పొందారు. ముఖ్య అతిదిగా దుబ్బ కిషన్ ఇంటెలిజెన్స్ సిఐ హాజరై విద్యార్థులు మొబైల్ ఫోన్‌కు దూరంగా ఉంటూ చదువుతో పాటు ఆటల్లో రాణించాలన్నారు. జబర్దస్త్ ఫేమ్ రాజమౌళి మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నతంగా ఎదిగి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకు రావాలని కాంక్షించారు. కట్ట శేఖర్ అసిస్టెంట్ ప్రొఫెసర్ మాట్లాడుతూ విద్యార్థులు సమయాన్ని సద్వినియోగం చేసుకుని అనుకున్న లక్ష్యాన్ని సా దించాలన్నారు.డాక్టర్ నాగేశ్వరరావు మాట్లాడుతూ పుస్తక పఠనాసక్తి పెంపొందించుకుని క్రమశిక్షణతో చదువులో రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు అక్రమ్, సంతోష నరసింహ, సంధ్య, విజయ్ శ్రీ, వినిష లత , తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## నాలుగు దశాబ్దాల తర్వాత కలిసిన ఆత్మీయ స్నేహాలు!




**ప్రజాపక్షం/హాలియా:** ఆత్మీయ పలకరింపులకు అల్లాడిపోతున్న నేటి సమాజంలో... నాలుగు దశాబ్దాల తర్వాత స్నేహ మాధుర్యాన్ని ఆస్వాదిస్తున్న రోజుల్లో విడదీసిన పదవ తరగతి చదువు తర్వాత ఎవరెక్కడో తెలియక సమాచార వ్యవస్థ లేక దూరమైన ఆ స్నేహం.... ఆ తర్వాత కలుసుకోవడానికి చేసిన ప్రయత్నాలు సఫలం కాలేదు... కానీ నేడు సమాచార వ్యవస్థ అంతా అరచేతిలో ఉండడంతో నాలుగు దశాబ్దాల క్రితం విడిపోయిన స్నేహ బంధాలను కలుపుకొని తనివి తీర మాట్లాడుకోవాలనే కోరిక వచ్చిన స్నేహితులకు అనుకున్నదే తడువుగా 198687 సంవత్సరంలో పదవ తరగతి చదువుకున్న స్నేహితులు అంతా కలుసుకోవాలని ప్రణాళికలు చేసుకొని ఆదివారం హాలియా ఉన్నత పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేసుకున్నారు.40 సంవత్సరాల తర్వాత విద్యార్థులందరూ తమ తమ స్నేహితులను కలుసుకొని ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకున్నారు. .తాము చదువుకున్న పాఠశాలకు రూ.25000లతో మొబైల్ మైక్ సెట్‌ను బహూకరించారు. ఈ కార్యక్రమంలో ఆనాటి ఉపాధ్యాయులు నరసింహారావు, యాదగిరి రెడ్డి, సత్యనారాయణ రాజు ,ప్రభాకర్ రావు, మోహన్ రెడ్డి,1986/87 సంవత్సరపు పూర్వ విద్యార్థులు తాళ్ల శ్రీధర్, కొమ్మనబోయిన చంద్రశేఖర్, కసిరెడ్డి శ్రీనివాసరెడ్డి, రవి, నాగార్జున, హమీద్, వర్ర వెంకటరెడ్డి, మల్లికార్జున్, షేక్ జలీల్, నల్లబోతు వెంకటయ్య, నాగమల్లేశం, సత్యనారాయణ, కరుణాకర్, వెంకటయ్య ,నరసింహారెడ్డి,గురువయ్య పాల్గొన్నారు.

## మహిళల పక్షపాతి కాంగ్రెస్ పార్టీ

**ప్రజాపక్షం/డిండి;** మహిళా సాధికారత ఆర్థిక, రాజ కీయ సమానత్వానికి పాటుపడిన ఏకైక పార్టీ కాంగ్రెస్ అని యువజన కాంగ్రెస్ రాష్ట ప్రధాన కార్యదర్శి జర్పుల లక్ష్మీ తిరుపతి అన్నారు. ఆదివారం ఆమె మా ట్లాడుతూ దేశ తొలి ప్రధాని ఇందిరా గాంధీ అని ఆమె నాయకత్వంలో భారత దేశం ప్రగతి పథంలో వచ్చింద న్నారు. సోనియాగాంధీ యూపిఏ చైర్ పర్సన్‌గా దేశంలో ఉండడం మూలంగానే బిసి, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల అభివృద్ధికై అనేక సంస్కరణలు చేపట్టిన దీశాలి అని కొనియాడా రు. 40 సంవత్సరాల నుండి ఉన్న బిజెపిలో ఒక్కరైనా అధ్యక్షులు మహి ళలను చేశారా అని జాతీయ పార్లమెంట్ కమిటి లో మహిళలు ఉన్నా రా అని నేడు 21 రాష్ట్రాలలో అధికారంలో ఉన్న బిజెపి లో ఎంత మంది మహి ళలు ఉన్నారని ఆమె ప్రశ్నిం చారు. మను వాదం ఆధారంగా ఏర్పడ్డ బిజెపి ఏనాటికి మహిళలను గౌరవించ లేదని నేడు మొసలి కన్నీరు కారుస్తున్న మోడీని దేశ మహిళలు నమ్మరని ఎద్దేవా చేశారు.

## మున్సిపల్ చైర్ పర్సన్ సుధా బాలకృష్ణకు సన్మానం

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** డీసీసీ కార్యదర్శి చిలుకూరు బాలకృష్ణ బాల్య స్నేహితులు ఆదివారం మండలంలోని చింతపల్లి గ్రామంలో మున్సిపల్ చైర్‌పర్సన్ చిలుకూరి సుధాబాలకృష్ణను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇది ప్రత్యేకమైన రోజు అని, నా భర్త స్నేహితులు అభిమానంతో సత్కరించడం సంతోషమన్నారు. స్నేహం అనేది ఎంతో పవిత్రమైన బంధం అని, బాల్య స్నేహం అంటే కల్మషం లేని అనుబంధం అన్నారు. చాంద్ పాషా, ఆజమ్‌ఖాన్, షరీఫ్, బలరాం, రమేష్, ఏజాజ్, బక్కయ్య, శ్రీను, మహేష్, వాసు, కూనల కృష్ణ తదితరులు ఉన్నారు.





## ఇంద్రపాలనగరాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలి

**ప్రజాపక్షం/రామన్నపేట** : చారిత్రత్మాక గ్రామమైన ఇంద్రపాలనగరంను పర్యాటక కేంద్రంగా మార్చి శిథిలావస్థకు చేరిన చెరువు తూములను మరమ్మత్తు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎండి జహంగీర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిపిఎం పోరుయాత్రలో భాగంగా ఇంద్రపాలనగరంలో గ్రామ శాఖ నాయకత్వంతో కలిసి పలు సమస్యలను పరిశీలన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రీ.శ ఆరవ శతాబ్దంలో విష్ణుకుండ్యుల రాజధానిగా చేసుకొని పాలించిన చారిత్రాత్మక ప్రదేశం నేడు నిరాధారణకు గురై పాలకుల నిర్లక్ష్యానికి నిలువెత్తు నిదర్శనంగా నెలకొన్నదని అన్నారు. గ్రామంలో నెలకొన్న సమస్యలపై అధికారులు ప్రత్యేక చొరవ చూపించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు జల్లెల పెంటయ్య,మండల కమిటీ సభ్యులు మీర్ ఖాజాఅలీ, శాఖ కార్యదర్శి శ్రీనివాస్ పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలి



**ప్రజాపక్షం/రామన్నపేట** : వడ్ల కొనుగోలు కేంద్రాలకు మిల్లులు అలాట్మెంట్ చేసి ధాన్యం కొనుగోలు వెంటనే ప్రారంభించాలని సుతిల్ ఖర్చులు సెంటర్ నిర్వాహకులు భరించాలని రైతులపై భారం మోపవద్దని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మేక అశోక్ రెడ్డి డిమాండ్ చేశారు. స్థానిక సిపిఎం కార్యాలయంలో జరిగిన రైతు సంఘం మండల కమిటి సమావేశంలో మాట్లాడుతూ రామన్నపేట మండలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినా కొనుగోలు మాత్రం ప్రారంభం కాలేదని ఇప్పటికే మండల వ్యాప్తంగా సుమారుగా 4 లక్షల క్వింటాలు ధాన్యం మార్కెట్లోకి చేరుతుందని రైస్ మిల్లులు అలాట్మెంట్ ఇప్పటికీ పూర్తిస్థాయిలో జరగలేదన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి బొడ్డుపల్లి వెంకటేశం, రైతు సంఘం మండల కార్యదర్శి గన్నెబోయిన విజయ భాస్కర్, నాయకులు గొరిగే సోములు, అప్పం సురేందర్, పాలెం అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

## పునర్విభజన రాజకీయాలతో చెలగాటం

**ప్రజాపక్షం/గరిడేపల్లి:** పునర్విభజన రాజకీయాలతో కేంద్రం చెలగాట ం మాడుతుందని సిపిఎం మండల కార్యదర్శి షేక్ యాకుబ్ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని రంగాపురం గ్రామంలో సిపిఎం జనరల్ బాడీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. 2011 జనాభా లెక్కల ప్రకారం కాకుండా స్థానిక సంస్థలను దృష్టిలో పెట్టుకుని మహిళ బిల్లు ప్రవేశపెట్టడం అప్రజాస్వామికమన్నారు. రాష్టంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు వ్యవసాయ కార్మికులందరికి సంవత్సరానికి 12వేల రూపాయలు ఇస్తానని హామీ ఇచ్చి రెండున్నర సంవత్సరాలైన ఎందుకు అమలు చేయడం లేదని విమర్శించారు. అర్జున్, నవీన్, మీసాల వెంకటి, వానరాశి అనిల్, రమణ పాల్గొన్నారు.

## సిసిరోడ్డు నిర్మాణ పనులకు శ్రీకారం

**ప్రజాపక్షం/త్రిపురారం** :మండల పరిధిలోని అంజనపల్లి గ్రామంలో ఆదివారం సీసీ రోడ్డు నిర్మాణ పనులను గ్రామ సర్పంచ్ కందుల వెంకటేశ్వర్లు కొబ్బరికాయ కొట్టి ఘనంగా ప్రారంభించారు. గ్రామాభివృద్ధి దిశగా చేపడుతున్న ఈ పనులు ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించనున్నాయని ఆయన తెలిపారు. సర్పంచ్ కందుల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గ్రామంలో ఎస్సీ సబ్‌ప్లాన్ కింద రూ.5 లక్షల నిధులతో మాడుపుకొండల ఇంటి నుంచి మడుపు శ్రీనివాస్ ఇంటి వరకు సీసీ రోడ్డు నిర్మాణం చేపడుతున్నట్లు వెల్లడించారు. అలాగే ఎన్‌ఆర్‌జీఎస్ నిధులతో పాత గ్రామ పంచాయతీ కార్యాలయం నుంచి ముత్యాలమ్మ గుడి వరకు మరో రూ.5 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.




## చలివేంద్రం ప్రారంభం

**ప్రజాపక్షం/మునగాల:** మండల పరిధిలోని వెంకట్రాంపురం గ్రామ పంచాయతీ పరిధిలోని జాతీయ రహదారి పక్కన ఉన్న ఎస్ఎంపేట గ్రామంలో మానవతా సేవకు నిలువెత్తు నిదర్శనంగా చలివేంద్రం ప్రారంభించినట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధికార ప్రతినిధి వేనేపల్లి వీరబాబు అన్నారు. కీర్తిశేషులు రాయల వెంకట నాగేశ్వరరావు జ్ఞాపకార్థం వారి కుమారులు రాయల సతీష్, సాయికుమార్ ఆధ్వర్యంలో ఈ చలివేంద్రాన్ని ఏర్పటు చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకుల కొలిశెట్టి బుచ్చిపాపయ్య, మాలోతు లక్యానాయక్, పాతకొట్ల నాగరాజు, రాయల సతీష్‌కుమార్ పాల్గొన్నారు.

## ఘనంగా అమ్మవారి విగ్రహ పునఃప్రతిష్టాపన





**ప్రజాపక్షం/సూర్యాపేట రూరల్ :** శ్రీశ్రీశ్రీ మహంకాళి అమ్మవారి విగ్రహ పునఃప్రతిష్టాపన మహోత్సవాన్ని సూర్యాపేట మండలంలోని గ్రామంలో ఆదివారం గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. మొదటి రోజు శనివారం ఆలయ శుద్ధి కార్యక్రమం నిర్వహించి వేద పండితుల ఆధ్వర్యంలో పోతురాజు విగ్రహాన్ని పునఃప్రతిష్టించారు. ఆదివారం గ్రామస్తులందరూ మహంకాళి అమ్మవారికి, పోతురాజుకు బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం గ్రామంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దుండిగాల శివాజీ, బొడ్డు రాంబాబు, నక్క శ్రీను, బంటు గోపి, బొడ్డు నవీన్, వనం ప్రశాంత్, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

## ఆర్థిక సహాయం అందజేత

**ప్రజాపక్షం/వలిగొండ :** వలిగొండ మండలం అరూర్ గ్రామ వాస్తవ్యులు బొడ్డు నరేష్ విద్యుత్ సంస్థలో గత 15 సంవత్సరాల నుండి ఆర్టిజన్ కార్మికుడిగా విధులు నిర్వర్తిస్తూ అకస్మాత్తుగా అనారోగ్యానికి గురై ఫిబ్రవరి నెలలో అకాల మరణం చెందారు.ఆపరేటర్ బొడ్డు నరేష్ కుటుంబ సభ్యులను పమర్శించి,కుటుంబానికి అండగా ఉంటామని మనో ధైర్యం కల్పించి రూ.44,500 ఆర్థిక సహాయం అందజేసిన 1104 యూనియన్ చౌటుప్పల్ డివిజన్ అధ్యక్షుడు అల్లే రమేష్, కార్యదర్శి గంగుల సోమేశ్వర రెడ్డి వారి కుటుంబ నేపథ్యం గమనించి వారి కుటుంబానికి అండగా ఉంటామని చెప్పి, కుటుంబానికి మనోధైర్యం కల్పించారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్, డివిజన్ జాయింట్ సెక్రటరీ నోముల యాదయ్య, సబ్ డివిజన్ లీడర్ నల్ల రాములు, సెక్షన్ లీడర్ గాజుల మహేష్, మచ్చ లింగ స్వామి, రమేష్, కిరణ్ రెడ్డి, నరేష్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.



# కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగ సవరణ చేపట్టాలి

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** సుప్రీంకోర్టు ఎస్‌సి రిజర్వేషన్లు ,మత మార్పిడి అంశంపై ఇచ్చిన తాజా తీర్పుపై కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగ సవరణ చేపట్టాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి నారి ఐలయ్య కోరారు.ఆదివారం వ్యవసాయ కార్మిక సంఘం నల్లగొండ జిల్లా ఆఫీస్ బేరర్స్ సమావేశం స్థానిక దొడ్డి కొమరయ్య భవన్లో జరిగింది ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఎస్సీ రిజర్వేషన్లపై ఇచ్చిన తీర్పు తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. రిజర్వేషన్లను మతంతో అనుసంధానం చేయడం పూర్తిగా అభ్యంతరకరం. గౌరవ న్యాయ స్థానం ఈ తీర్పును వెంటనే రివ్యూ చేయాలని కోరారు.జిల్లా అధ్యక్షులు బొజ్జ చిన్న వెంకులు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మహిళా కూలీల సంఘం జిల్లా కన్వీనర్ దండంపల్లి సరోజా,జిల్లా నాయకులు కంబాలపల్లి ఆనంద్, కత్తుల లింగ స్వామి,జటావత్ రవి నాయక్,చింతపల్లి లూర్దు,మారయ్య పాల్గొన్నారు.



# పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



**ప్రజాపక్షం/తిప్పర్తి :** పదవ తరగతి కలిసి చదువుకున్న విద్యార్థులు 36 సంవత్సరాల తర్వాత ఒకే చోట చేరి సందడి చేశారు.ఆదివారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1989 90 లో పదవ తరగతి చదువుకున్న విద్యార్థులు తమ కుటుంబ సభ్యులతో కలిసి హాజరయ్యారు. నాటి రోజులు గుర్తు చేసుకున్నారు.ఆ రోజుల్లో తమకు పాఠాలు చెప్పిన ఉపాధ్యాయులను పిలిచి ఘనంగా సన్మానించి వారి ఆశీర్వాదాలు తీసుకున్నారు ఈ క్రమంలో ఉపాధ్యాయులు నాటి రోజులని పూర్తిచేసుకుని ఓల్డ్ ఇస్ గోల్డ్ అనే మాట మరోసారి నిరూపితమైందని కొనియాడారు. ఉదయం పూట అధ్యాపకుల ప్రసంగాలతో భావోద్వేగంగా సాగిన ఈ కార్యక్రమం సాయంత్రం వరకు విద్యార్థులు సందడి డ్యాన్సులతో సరదాగా ముగిసింది ఈ కార్యక్రమంలో ఆర్గనైజర్ గోలి వెంకటేశ్వర్లు,మల్లేష్ ఆదిమూలం సూర్యం,రవికుమార్. పుల్లారెడ్డి,నిషి నిరీక్షణ, పాల్వాయి కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.



## పురుషోత్తం మృతి పట్ల సిపిఐ నాయకులు నివాళి

**ప్రజాపక్షం/డిండి;** గోనకల్ గ్రామానికి చెందిన సిపిఐ మాజీ గ్రామశాఖ కార్యదర్శి మందారి వెంకటయ్య కుమారుడు మందారి పురుషోత్తం అనారోగ్యంతో మరణించాడు. ఆదివారం గోనకోల్ గ్రామంలో పురుషోత్తం పార్థివదేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో సిపిఐ డిండి మండల కార్యదర్శి కనకాచారి, మండల సహాయ కార్యదర్శి శైలేష్, ఏఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు నవీన్, సిపిఐ గ్రామశాఖ కార్యదర్శి వెంకటేశ్వర్లు, తవక్లాపూర్ గ్రామశాఖ కార్యదర్శి చక్రి, ఏఐఎస్ఎఫ్ డివిజన్ అధ్యక్షులు వినయ్, కళ్యాణ్, సాగర్, ప్రవీన్, పర్వతాలు, ప్రేమయ్య, బాను, సిద్దు పాల్గొన్నారు.

## నర్సింహకు నివాళులు

**ప్రజాపక్షం/దేవరకొండ;** దేవరకొండ పట్టణంలోని 13వ వార్డు కౌన్సిలర్ పులిజాల జానీ తండ్రి దివంగత పులిజాల నర్సింహా దశదిన కర్మ ఆదివారం జరిగింది. ఈకార్యక్రమానికి బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నేనావత్ కిషన్‌నాయక్ పాల్గొని నర్సింహా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈకార్యక్రమంలో కేతావత్ బిల్యా నాయకులు, గాజుల ఆంజనేయులు, మండల అధ్యక్షులు టివిఎన్‌రెడ్డి, కౌన్సిలర్లు రూప్లానాయక్, మురళి పాల్గొన్నారు.





## ఆది జాంబవ విగ్రహ ప్రతిష్ఠకు నిర్ణయం

**ప్రజాపక్షం/గుండాల;** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండల కేంద్రంలో శ్రీ స్వయంబు ఆది జాంబవ గుడి నిర్మాణానికి సంబంధించి ఆదివారం కుల పెద్దలు నిర్ణయించిన నేపథ్యంలో జూన్ 07వ తేది నుండి జూన్ 11వ తేది వరకు ఆది జాంబవుని గుడి, విగ్రహ ప్రతిష్టా కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో ఎక్కిరాల వెంకటనర్సయ్య, జాంబవ విగ్రహ రూప శిల్పి చింత స్వామి, ఆర్ఎస్ఎస్ బోసేపల్లి ప్రతాప్, శిల్పి వెంకటనర్సింహ స్వామి, గురువులు మహేష్, మల్లేష్, పెద్దమనుషులు పాల్గొన్నారు.

## శంకర్‌కు సన్మానం

**ప్రజాపక్షం/బీబీనగర్ :** ఎంఆర్పిఎస్ ఉద్యమంలో పనిచేసి వివిధ రంగాల్లో సేవలు అందించిన బీబీనగర్ మండలం చిన్న రావులపల్లి గ్రామానికి చెందిన సోమవారం శంకర్ 14న దళితరత్న అవార్డు రావడం పట్ల ఆదివారం బీబీనగర్ మండల దళిత సంఘాల నాయకులు శంకరు శాల్వా పూలమాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బాబు జగజీవన్ రామ్ సంఘం అధ్యక్షులు ఎమ్మార్పిఎస్ గ్రామ శాఖ అధ్యక్షులు గోల్కొండ మహేష్ బాబు, వెంకటేష్ సన్మానించారు.



## 22 నుండి అభయాంజనేయ స్వామి బ్రహ్మోత్సవాలు

**ప్రజాపక్షం/నాంపల్లి :** మండలంలోని దామెర గ్రామంలో శ్రీ అభయాంజనేయ స్వామి జాతర బ్రహ్మోత్సవాలు ఈనెల 22, 23న వైభవంగా నిర్వహించనున్నట్లు గ్రామ సర్పంచ్ దామెర శోభ సహదేవ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 22న స్వామివారికి హోమం,ప్రత్యేక పూజలు, 23న రథోత్సవం జరుగుతాయి. ఇట్టి బ్రహ్మోత్సవాలకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. ఆలయ అభివృద్ధికి దాతలు విరాళాలు అందజేయవచ్చని సర్పంచ్ ,పూజారులు తెలిపారు. బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తుల కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు.

## తాలు పేరుతో రైతుల దోపిడీని అరికట్టాలి

**ప్రజాపక్షం/నకిరేకల్ :** ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ‘తాలు’ పేరుతో తరుగు తీస్తూ రైతులను దోపిడీ చేస్తున్నారని, దీనిపై అధికారులు వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని సిపిఎం మండల కార్యదర్శి రాచకొండ వెంకన్నగౌడ్ కోరారు. ఆదివారం మండలంలోని నోముల గ్రామ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సిపిఎం ఆధ్వర్యంలో పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కేంద్రాల్లో కనీస వసతులు లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎరుకలి అంజయ్య,గ్యార సైదులు,ఘర్షకోటి పెద్ద వెంకటయ్య,కప్పల జానయ్య, ఘర్షకోటి వెంకన్న,నరసింహ,నాగరాజు పాల్గొన్నారు.

## చలివేంద్రానికి పెరుగు అందజేత



**ప్రజాపక్షం/కొండమల్లేపల్లి;** మండల కేంద్రంలో కేఎంపి హెల్పింగ్ హ్యాండ్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చలివేంద్రానికి ఆదివారం పట్టణంలోని ఎస్‌పిఆర్ పాఠశాల యాజమాన్యం 100కేజీల పెరుగును అందజేశారు. ఈసందర్భంగా ఎస్‌పిఆర్ పాఠశాల డైరెక్టర్ వరప్రసాద్ మాట్లాడుతూ వేసవి కాలంలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేసిన కేఎంపి హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులను అభినందించారు. తమ సేవా కార్యక్రమాలు ఎల్లప్పుడు ఉంటాయని తెలిపారు. ఈకార్యక్రమంలో కేఎంపి హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు ఏరుకొండ రాము, కూన భానుచందర్, పాఠశాల సిబ్బంది వెంకన్న, సునిత, విప్లవ్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, నరేష్ పాల్గొన్నారు.

## రైతు భరోసా రెండవ విడత డబ్బులు నేడు ఖాతాలోకి

**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అందజేస్తున్న రైతు భరోసా పథకం కింద అందజేసే ఆర్థిక సహాయం రెండో విడత డబ్బులు నేడు ముఖ్యమంత్రి చేతుల మీదుగా నిధులు విడుదల చేసి రైతు ఖాతాలో జమ చేస్తారని ఆదివారం మండల వ్యవసాయ అధికారిణి శైలజ ఒక ప్రకటనలో తెలిపారు. రైతు వేదికల ద్వారా డిస్ప్లే స్క్రీన్ పై ప్రత్యక్ష ప్రసారం ద్వారా నేడు రైతులకు వీక్షించే సౌకర్యం కల్పిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. ఎన్ని ఎకరాల లోపు వారికి ఈ ఆర్థిక సహాయం అందజేస్తారో నేడు ప్రత్యక్షంగా రైతులు కార్యక్రమంలో పాల్గొని తెలుసుకోవచ్చు అన్నారు.

## ఆర్థిక సాయం అందజేత



**ప్రజాపక్షం/గుండాల;** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం అనంతారం గ్రామానికి చెందిన ఎలిమినేటి యాదయ్య అనారోగ్యంతో మరణించడంతో విషయం తెలుసుకున్న మబ్బు అబ్బాస్ ఫౌండేషన్ చైర్మన్ మబ్బు మహేష్‌బాబు యాదయ్య కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలుపుతూ రూ. 5వేలను ఆర్థిక సాయంగా అందజేయడం జరిగింది. ఈకార్యక్రమంలో రమేష్, నవీన్‌గుప్త, వీరస్వామి, మోహన్‌రెడ్డి, ఎల్లయ్య, శ్రీకాంత్, బిక్షం, అమరేందర్, ఫౌండేషన్ అధ్యక్షులు పరుశురాములు, విక్రమ్‌రెడ్డి, చందు, సోమన్న, మదన్‌మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## డీలిమిటేషన్‌తో మహిళా బిల్లును ముడిపెట్టడం అన్యాయం

**ప్రజాపక్షం/నకిరేకల్** : మహిళా రిజర్వేషన్ బిల్లును డీలిమిటేషన్ నియోజకవర్గాల పునర్విభజన అంశంతో ముడిపెట్టడం ద్వారా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం దక్షిణాది రాష్ట్రాలకు తీవ్ర అన్యాయం చేస్తోందని తెలంగాణ.కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దైద రవీందర్ విమర్శించారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.బిజెపిఅనుసరిస్తున్న ప్రజాస్వామ్య విరుద్ధ విధానాలపై మండిపడ్డారు.డీలిమిటేషన్ ప్రక్రియను ఇతర బిల్లులతో అనుసంధానం చేయడం వల్ల జనాభా నియంత్రణను పాటిస్తూ అభివృద్ధి పథంలో దూసుకుపోతున్న దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యం పార్లమెంటులో తగ్గే ప్రమాదం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. రానున్న రోజుల్లో దక్షిణాది రాష్ట్రాల హక్కుల కోసం తమ పోరాటం కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు.

## మహిళా బిల్లుపై బిజెపికి చిత్తశుద్ధి లేదు

**ప్రజాపక్షం/ఆలేరు** : మహిళా రిజర్వేషన్ బిల్లుపై భారతీయ జనతా పార్టీకి చిత్తశుద్ధి లేదని యాదాద్రి భువనగిరి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు నీలం పద్మ వెంకటస్వామి విమర్శించారు. కాంగ్రెస్ పార్టీని మహిళా వ్యతిరేక పార్టీగా చిత్రీకరిస్తూ, పార్లమెంటులో మహిళా రిజర్వేషన్ బిల్లును అడ్డుకుందని బీజేపీ చేస్తున్న ప్రచారం అసత్యమని ఆమె ఖండించారు. ఆదివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ మహిళా రిజర్వేషన్ బిల్లును ఇప్పటికే 2023లో పార్లమెంట్ ఏకగ్రీవంగా ఆమోదించిందని తెలిపారు. ప్రస్తుతం లోక్సభలో విఫలమైనది మహిళా రిజర్వేషన్ బిల్లు కాదని, రాజ్యాంగ సవరణ పేరిట నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) మరియు స్థానాల సంఖ్య పెంపు అంశాలతో ముడిపెట్టిన ప్రతిపాదనలేనని స్పష్టం చేశారు. మహిళా రిజర్వేషన్ బిల్లుపై తప్పుదారి పట్టించే ప్రచారం చేస్తున్నందుకు బీజేపీ మహిళలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. మహిళల హక్కుల కోసం కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని, మహిళలకు సముచిత ప్రాతినిధ్యం కల్పించేందుకు తమ పోరాటం కొనసాగుతుందని నీలం పద్మ వెంకటస్వామి తెలిపారు.

## ట్రాక్టర్ ఢీకొని యువకుడు మృతి

**ప్రజాపక్షం/సూర్యాపేట రూరల్** : ట్రాక్టర్ స్కూటీని ఢీకొన్న ప్రమాదంలో యువకుడు మృతి చెందగా మరొకరికి తీవ్ర గాయాలైన సంఘటన మండలంలోని కాసరాబాద్ రోడ్డులో చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కాసరాబాద్ గ్రామానికి చెందిన కొల్లు సందీప్ (28) వృత్తిరీత్యా ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తూ పని నిమిత్తం తన మిత్రుడితో కలిసి స్కూటీపై కాసరాబాద్ నుండి సూర్యాపేటకు వెళ్తుండగా వడ్ల లోడ్‌తో వస్తున్న ట్రాక్టర్ ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో సందీప్ తల ఛిద్రమై అక్కడికక్కడే మృతి చెందగా, మిత్రుడికి తీవ్ర గాయాలయ్యాయి. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సూర్యాపేట జనరల్ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నారు.



## బెల్లి లలితక్క విగ్రహాన్ని నెలకొల్పుకోలేక పోవటం బాధాకరం

**ప్రజాపక్షం/భువనగిరి** : తెలంగాణ రాష్ట్రం సాధించుకున్నా తెలంగాణ కోసం ప్రాణ త్యాగం చేసిన బెల్లి లలితక్క విగ్రహాన్ని నెలకొల్పుకోలేక పోవటం బాధాకరం అని బెల్లి లలితక్క కుమారుడు సూర్యప్రకాష్, పలువురు ప్రముఖులు అన్నారు. తెలంగాణ గాన కోకిల బెల్లి లలితక్క విగ్రహ ప్రతిష్టాపన సన్నాహక సమావేశం బెల్లి లలితక్క కుమారుడు సూర్యప్రకాష్ ఆధ్వర్యంలో యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలోని భువనగిరి S.V హోటల్‌లో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమకారులు, బెల్లి లలితక్క కుటుంబ సభ్యులు, లలితక్క అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరు కావడం గొప్ప విషయం అన్నారు. బెల్లి లలితక్క త్యాగ నిరతిని, పోరాట పటిమను ఎత్తిపట్టి ఆమె ఆశయాల సాధన కోసం కృషి చేయాలని అందరూ చేయి చేయి కలిపారున్నారు. ఆ క్రమంలోనే రాజకీయాలకు, పార్టీలకు అతీతంగా అందరూ కలిసి విగ్రహ ప్రతిష్ఠాపన కోసం కృషి చేయాలని తీర్మానించారు. ఈ సమావేశంలో ప్రముఖులు భట్టు రామచంద్రయ్య,సామ మల్లారెడ్డి, తంగెళ్లపల్లి రవికుమార్, పూస శ్రీనివాస్, భువనగిరి శ్రీనివాస్ నేత, శ్రీనివాసాచార్యులు, దయ్యాల రామనర్సయ్య, ఏశాల అశోక్, పుట్ట వీరేష్ యాదవ్, ఎల్లముల జంగయ్య,పాశపాక మహేశ్, ఆరుముళ్ల రమేష్,శ్రీరాం మురళికృష్ణ,చిలుకల రమేష్ హాజరయ్యారు.




## పుష్ప మాలలతో శోభాయమానంగా అలంకరణ

**ప్రజాపక్షం/భువనగిరి** : కలియుగ ప్రత్యక్ష దైవమైన శ్రీ శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని మని మయ శోభిత స్వర్ణాభరణాలతో పరిమళభరిత పుష్ప మాలలతో శోభాయ మానంగా అలంకరించి వేయి నామాల శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి సహస్ర నామార్చన సేవను ఘనంగా నిర్వహించారు. స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి ప్రాతఃకాలంలో అర్చక స్వాములు సుప్రభాత సేవను విశేషంగా నిర్వహించారు. సుప్రభాతసేవ అనంతరం శ్రీ మహాలక్ష్మి అమ్మవారు, ముప్పది మూడు కోట్ల దేవతలు కొలువు తీరినట్టి గోపృష్ఠ దర్శనాన్ని చేయించారు. శ్రీ వేంకటేశ్వర స్వామివారికి నిత్యారాధన నిమిత్తం అర్చక స్వాములు వేద మంత్రోచ్ఛారణలతో సువర్ణ బిందె తీర్థమును బంగారుబావి నుండి తీసుకువచ్చారు. శ్రీ స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దివ్య క్షేత్రంలో లోక కళ్యాణం కోసం అర్చక స్వాములు శ్రీ సుదర్శన నారసింహ హవనంను నిర్వహించారు. విశ్వేశ్వరుడైన శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి పట్టు పీతాంబరాలు ధరింపజేసి మరియు సుగంధ భరిత పుష్పమాలలతో అలంకరించి అర్చక స్వాములు స్వామివారి నిత్య కళ్యాణ మహోత్సవాన్ని శ్రీవారి వైభవోత్సవ మండపంలో వేదమంత్రాలతో మంగళ ధ్వనుల మధ్య అంగరంగ వైభవంగా నిర్వహించారు. భక్తులు శ్రీ స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని తిలకించి ఆనంద పరవశులైనారు. సుమారు 5000 మందికి పైగా భక్తులు నిత్యాన్న ప్రసాదాన్ని స్వీకరించారు.



## వేసవిలో మళ్లీ గోలి సోడా సందడి



### పాత జ్ఞాపకాలకు కొత్త రుచితో గోలి సోడా జోరు

**ప్రజాపక్షం/నాంపల్లి:** ఒకప్పుడు వేసవి కాలం వచ్చిందంటే చాలు గల్లీ గల్లీలో వినిపించే టప్ అనే శబ్దం, వెంటనే వచ్చే బుడగల సందడి,ఆ తర్వాత గొంతులోకి జారే చల్లని గోలి సోడా రుచి అది ఓ ప్రత్యేక అనుభూతి. ఇప్పుడు అదే గోలి సోడా మళ్లీ జోరందుకుంది. పాత జ్ఞాపకాలకు కొత్త మెరుగులు దిద్దుకుంటూ గోలి సోడా మరోసారి ప్రజల మనసులు గెలుచుకుంటోంది.కాలం మారుతున్న కొద్దీ ఎన్నో కొత్త రకాల కూల్‌డ్రింక్స్ మార్కెట్లోకి వచ్చినా, మన పాతకాలపు గోలి సోడాకు ఉన్న ఆదరణ మాత్రం ఏమాత్రం తగ్గలేదు. ఒకప్పుడు మరుగున పడిపోయిన ఈ వింటేజ్ డ్రింక్ ఇప్పుడు సరికొత్త రూపంలో నగరాల నుంచి పల్లెల వరకు సందడి చేస్తోంది.

ఎందుకు ఈ క్రేజ్?

ఒకప్పుడు కేవలం ప్లెయిన్ సోడా, నిమ్మకాయ సోడా మాత్రమే అందుబాటులో ఉండేవి. కానీ ఇప్పుడు వినియోగదారుల అభిరుచులకు అనుగుణంగా గోలి సోడా అనేక కొత్త రుచులతో మార్కెట్లోకి వచ్చింది. అల్లం సోడా, పచ్చి మామిడి, మ్యాంగో, కాలా నమక్, బ్లూబెర్రీ, పన్నీర్ సోడా వంటి వెరైటీ ఫ్లేవర్స్ ఈ తరం యువతను, పిల్లలను కూడా ఆకట్టుకుంటున్నాయి.


ఆనాటి జ్ఞాపకం

90వ దశకంలో పుట్టిన వారికి గోలి సోడా తాగడం అనేది కేవలం పానీయం కాదు ఒక ఎమోషన్. గోలి బాటిల్‌ను వేలితో నొక్కినప్పుడు వచ్చే శబ్దం, ఆ తర్వాత పైకి ఎగిసే నురగ, ఒక్క ముద్ద తాగగానే కలిగే ఆ తీపి చల్లదనం ఇవి అన్నీ బాల్య జ్ఞాపకాలను మళ్లీ గుర్తుకు తెస్తాయి.అధేవిదంగాప్లాస్టిక్ బాటిల్స్‌లో దొరికే సాఫ్ట్‌డ్రింక్స్ కంటే గాజు సీసాలో ఉండే గోలి సోడా ఆరోగ్యానికి మేలనే భావన ప్రజల్లో పెరుగుతోంది. ముఖ్యంగా ఇందులో వాడే నిమ్మకాయ, అల్లం వంటి పదార్థాలు జీర్ణక్రియకు మేలు చేస్తాయని చాలామంది నమ్ముతున్నారు. అందుకే వేసవిలో శరీరానికి చల్లదనం, కడుపుకు తేలిక అనే ఉద్దేశంతో గోలి సోడా వైపు మొగ్గు చూపుతున్నారు.

పాత రుచికి కొత్త ఆదరణ

టెక్నాలజీ ఎంత పెరిగినా, మన మూలాల్లో ఉన్న రుచులకు ఉండే ఆదరణ ఎప్పటికీ తగ్గదని గోలి సోడా పునరాగమనం స్పష్టం చేస్తోంది. ఈ మండే వేసవిలో గొంతు ఎండిపోయినప్పుడు ఒక చల్లని గోలి సోడా తాగితే వచ్చే మజా నిజంగా వేరు.

## రెండు కార్లు ఢీ.. వ్యక్తి మృతి






**ప్రజాపక్షం/తుర్కపల్లి** : యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండలంలోని వాసాలమర్రి గ్రామ శివారులో ఆదివారం సాయంత్రం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. రెండు కార్లు ఢీకొన్న ప్రమాదంలో ఒక వ్యక్తి అక్కడికక్కడే దుర్మరణం చెందగా, మరో వ్యక్తి స్వల్పగాయలతో బయటపడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం జగదేవపూర్ నివాసి కొంపల్లి గణేష్ అనే వ్యక్తి ఎపి11 ఎఎస్3744 గల కారు నడుపుతూ, టాటా టియాగో టిఎస్08 ఎఫ్ఆర్5208 నెంబర్ గల కారును వెనుక నుంచి బలంగా ఢీకొట్టిందని,ఈ ప్రమాదంలో నాగారం నివాసి (కీసర) ఎరాల పవన్ కుమార్(39)అనే వ్యక్తి తీవ్ర గాయాల వల్ల ఘట స్థలంలోనే మృతి చెందాడని,మరొక వ్యక్తి తిలక్ కుమార్ స్వల్ప గాయాలు అయ్యాయని తెలిపారు. మృతుడు పవన్ కుమార్ మృతదేహాన్ని భువనగిరి ఏరియా ఆసుపత్రి మార్చురీకి తరలించడం జరిగిందని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు తుర్కపల్లి ఎస్సై తక్యుద్దీన్ తెలిపారు.

## దళిత వార్డుల్లో డ్రైనేజీ నిర్మాణం చేపట్టాలి




**ప్రజాపక్షం/తుర్కపల్లి** : సిపిఎం పార్టీ పోరుబాట కార్యక్రమంలో భాగంగా ఆదివారం తుర్కపల్లి మండల కేంద్రంలోని 6, 7వ దళిత కాలనీ, బిసి వార్డులను సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో పరిశీలించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి పోతరాజు జహంగీర్ మాట్లాడుతూ దాదాపు 20 సంవత్సరాలుగా సిసి రోడ్లు నిర్మాణం చేసి, డ్రైనేజీ నిర్మాణాలు మరిచారని, ప్రభుత్వాలు స్థానిక ప్రజా ప్రతినిధులు అని అన్నారు. ప్రతి ఇంటి నుండి వేస్టేజ్, నీరు రోడ్లపైకి రావడం తోని, ఎత్తు తక్కువ ఉన్న ఇండ్లలోకి నీరు వచ్చి కాలనీ ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, దీనివలన సీజనల్ అంటువ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని అన్నారు. గతంలో ఎన్ని సార్లు ఎమ్మార్వోకు, ఎంపీడీవోకి, పంచాయతీ కార్యదర్శులకు వినతి పత్రాలు అందజేసిన ఫలితం శూన్యం అని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు కొక్కొండ లింగయ్య, తలారి మాతయ్య, గడ్డమీది నరసింహ, ఆవుల కలమ్మ, బిచ్చాల సంతోష్, ఆవుల మహేష్, తలారి భాను, కాలనీ ప్రజలు అంజమ్మ, భారతమ్మ, లక్ష్మి పాల్గొన్నారు

## నిశ్చితార్థ వేడుక

**ప్రజాపక్షం/గుండాల**; యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం పెద్దపడిశాల గ్రామానికి చెందిన ఆంధ్రప్రభ విలేకరి సత్య నిశ్చితార్ధ వేడుక ఆదివారం రామారం గ్రామంలో జరిగింది. ఈ నిశ్చితార్ధ కార్యక్రమానికి బిఆర్ఎస్ నియోజకవర్గ ఇంచార్జ్ ఆలేరు మాజీ ఎంఎల్ఏ గొంగిడి సునిత మహేందర్‌రెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈకార్యక్రమంలో బిఆర్ఎస్వి రాష్ట్ర ఉపాధ్యక్షులు తుంగ బాలు, నాయకులు పాల్గొన్నారు.

